శనిగాడు అను ఆషాఢభూతి కథ

"నందగోకుల బృందావన మురళీమోహన రాధావేణుగోపాల బాలకృష్ణమూర్తికి శని విరగడయింది" అని కృష్ణమూర్తి తాలూకు మిత్రులంతా ఏకకంఠంతో గావుకేక పెట్టారు. అతనీ కొత్తయింట్లో ప్రవేశించి నివసించిన అర్థ శతదినోత్సవ సందర్భంగా అతనితో ఇప్పించుకున్న టీపార్టీ ముగించి.

"ఇత్తకు బిచ్చిల ఆలద్దవ్‌తో శతదినోత్సవవ్ చేసుకోవాల ఆశిస్తుల్లా" అన్నాడొక సుబ్బరామయ్య కొంచెం ముక్కుపొడుం పీల్చి-ప్రక్కనున్న ఎస్. కె. పి. వామన్రావుకి కోపం వచ్చి, "చీ నోర్ముయ్! వెధవ శతదినోత్సవం! 25 వారాలని కోరుకోరా" అంటూ అతని వీపు పగలగొట్టేశాడు.

వెంటనే వామన్రావు తాలూకు డొక్క చీరేస్తూ "50 వారాలని అనరా" అంటూ శాసించాడు అంకిరెడ్డి.

"60 వారాలని అంటావా లేదా?"అని అంకిరెడ్డి తోలొలిచేశాడు మావుళ్ళయ్య.

గంగివెర్రులెత్తిపోయిన భావన్నారాయణ వీళ్ళందరి తలలు బద్దలుకొట్టాలనుకున్నాడు గానీ, వాళ్ళలో ఒక్కడికీ తలకాయ ఉన్నజాడ కనబడక, ఆ ప్రయత్నం విరమించి, గట్టిగా ఓ చుట్ట దమ్ములాగి, గొంతు జీరపోకుండా సద్దుకుని, "ఈ వెధవ పీనుగుల కూతలకేంలే కృష్ణమూర్తీ! నువ్వీ యింట్లో పరమానందంతో, స్వర్గసుఖాలనుభవిస్తూ, శాశ్వతంగా..." అంటుండగానే ఒకచెయ్యి వచ్చి అతని పీక నులిమెయ్యసాగింది మరి మాట రానీకుండా.

అందరూ గుడ్లప్పగించి చూశారు.

ఆ చెయ్యి ఆ యింటి ఖామందుగారిది!

"ఉండడానికి వీల్లేదు అని పూర్తిచేస్తావా లేదా" అంటూ ఇంకా గట్టిగా నులిమేస్తున్నాడు ఖామందు.

'అలాగే అంటాను' అనే భావంతో అతని కళ్ళు సజ్ఞచేసిన తర్వాత ఆ చెయ్యి పట్టు వదిలింది.

భావన్నారాయణకు మాటలొచ్చాయి మళ్ళీ! ఖామందుతో చేసుకున్న ఒప్పందం ప్రకారం అదే మాటనేశాడు.

ఖామందుగారు శాంతించి, "నా కిబ్బంది లేనంతకాలం సుఖసంతోషాలకు లోటులేకుండా ఉండు కృష్ణమూర్తీ" అంటూ ఆశీర్వదించారు.

కృష్ణమూర్తి కృతజ్ఞుడై, వఠి 'థాంక్స్' అనే మాటలతో సరిపెట్టడానికి మనసొప్పక, "మీరుకోరిన తక్షణం మీకుగాని, మీ వల్ల ఆర్డరుపొందిన మరొకరికిగానీ ఇల్లు ఖాళీచేసి ఇవ్వగలవాడను. ఇది నా సమ్మతిని వాగేసి

పెండ్యాల నాగంజనేయులు

ఇచ్చిన ప్రామిసరీ నోటిమాట. ఇట్లు కృష్ణమూర్తి" అన్నాడు హుషారుగా.

మిత్రబృందం చప్పట్లదర గొట్టేసింది.

ఖామందు వారితోబాటు తనచేతులు కలిపాడు.

"కూర్చోండి బాబూ! టిఫిన్ చేద్దురుగాని" అన్నాడు కృష్ణమూర్తి.

"నా వ ల్ల కా దు నా య నా" అన్నాడు ఖామందు.

"ఒక్కటంటే ఒక్క స్వీటు" ప్రాధేయపడ్డాడు కృష్ణమూర్తి.

"అమ్మమ్మ! షుగర్ కంప్లెయింట్."

"కాస్త కారబ్బూంది?"

"బాబోయ్! గ్యాస్ట్రిక్ ట్రబులు."

"కాస్త పంచదారలేని టీ?"

"వద్దునాయనా పైత్యం! మీ కళ్ళముందే దొక్కుంటాను."

"పోనీ మీకు జబ్బుచేయని వస్తువేదో చెప్పండి. నిముషంలో రెడీ చేయిస్తాను" అంటూ చిటికేశాడు కృష్ణమూర్తి.

"నాకు జబ్బుచెయ్యని వస్తువు డబ్బు నాయనా! ఎంతయినా హరించుకోగలను. ఇవాళ ఒకటో తారీకుగదా? నా అద్దె నాకు తినిపించేస్తే హాయిగా త్రేన్చుకుంటూ వెళ్తాను" అన్నాడు ఖామందు చిర్నవ్వుతో.

ముసలాడి సెన్స్ ఆఫ్ హ్యూమర్కి కృష్ణమూర్తితోబాటు మిత్రులంతా మెచ్చుకున్నారు.

కృష్ణమూర్తి వెంటనే అద్దె చెల్లించాడు.

"సుఖీభవ" అని ఆశీర్వదిస్తూ "అబ్బాయిలూ! చూడండి! ఇది మీతోబాటు నాకూ సంతోష సమయమే! కాబట్టి మీరంతా "కలసిరాని కాలం" సినిమా చూడాలనుకుంటే, మన హాల్లోనే ఆడ్తోంది కాబాట్టి, ఉచితంగా చూసే ఏర్పాటు చేస్తాను" అన్నాడు ఖామందు.

"జై ఖామందురికీ జై! ఖామందుగారూ జిందాబాద్" అంటూ ఓండ్రపెట్టేరంతా.

"సరే! నేను మేనేజరికి ఫోనుచేస్తాను. బయల్దేరండి" అన్నాడు ఖామందు.

కృష్ణమూర్తి భార్యను తలుపు మూసుకుని జాగ్రత్తగా వుండమని చెప్పి స్నేహితులతో సినిమాకి బయలదేరాడు.

ఇంటిగుమ్మం దిగగానే అతని పోర్షనువైపు వున్న కాంపౌండ్ వాలుమీద ఓ కాకివాలి గోల మొదలెట్టింది.

"ఇదేమిటే నీయమ్మ కడుపుమాడ. చుట్టాలెవరయినా ముట్టడించబోతున్నారా?" అనడిగాడు కృష్ణమూర్తి.

కాకిగోల మానలేదు.

"మా అత్తగారా?" గుండెలు దడదడ కొట్టుకుంటుండగా అడిగాడు.

"కాకా" అంటుందేగాని ఎగిరి గంతెయ్యలేదు కాకి.

కృష్ణమూర్తికి దడ తగ్గిపోయింది. ధైర్యం వచ్చేసింది. జ్ఞాపకమున్నంతవరకూ ప్రతిచుట్టం పేరుపెట్టి అడిగాడు.

కాకి ప్రవర్తనలో మార్పేమీలేదు.

కృష్ణమూర్తికేమీ తోచక, కాకి శనిగాడి వాహనం గదా! ఒకవేళ వాడేమైనా వస్తున్నాడేమోనని అనుమానం కలిగి ఆ మాటే నిలదీసి అడిగాడు.

ఎగిరి గంతేసింది కాకి—కాని ఎగిరిపోలేదు; కాకా మానలేదు.

అంతా నవ్వుకో సాగారు.

ఖామందుగారికి కాకి ప్రవర్తనకు కోపంవచ్చి "ఇంకా ఎవడొస్తున్నాడే నీ మొగుడు ఆషాఢభూతిగాడు?" అనడిగాడు.

ఈసారి కాకి ఎగిరి గంతేసి మరీ యెగిరిపోయింది.

"నీ యింటికో శనిగాడూ, నా యింటికో ఆషాఢభూతీ వస్తారటయ్యా కృష్ణమూర్తీ! ఎందుకయినా మంచిది ఓ పోలీసు రిపోర్టు యిద్దామా?" అంటూ జోకేశాడు ఖామందు.

"మీరావని చెయ్యండి. నేను మాత్రం తైలాభిషేకంచేస్తాను" అన్నాడు కృష్ణమూర్తి.

"ఏడ్చినట్టున్నాయి మన జోకులు. సర్లే పదండి! సినిమాకి టైమవుతోంది" అంటూ తరిమేశాడు ఖామందు.

* * *

సుమారు ఆరు నెల్లక్రితం కృష్ణమూర్తి హైదరాబాద్నుంచి మద్రాసు ట్రాన్స్ఫరయి



వచ్చాడు ఉద్యోగరీత్యా.

వచ్చేజీతం బొత్తిగా 350 రూపాయలే కావడంవల్ల అద్దె చవగ్గదా అని పాతమాంబళం లోనే నివసించిచడం మొదలుపెట్టేడు. ఇప్ప టికి నాలుగిళ్ళు మారి అయిదో ఇల్లన్నమాట!

అదేం ఖర్మమో ఏ ఇంట్లో ప్రవేశించినా ప్రాణానికి సుఖం లేకపోయింది. ఎక్కడా నెలా పదిహేను రోజులకన్నా ఎక్కువ వుండే లేకపోయాడు.

మొదటి ఇల్లు : అన్ని సౌకర్యాలూ బావుం డేవిగాని మిద్దెమీద ఉండేవాళ్ళు ప్రాణభయం తెచ్చిపెట్టేరు. వీళ్ళ నెత్తిమీదెక్కి పిండో, కారమో, సాంబారుపొడో కొట్టేస్తుండేవారు రాత్రి పది గంటల్నుంచీ! కింద వీళ్ళ పడగ్గది. పైన వాళ్ళ రోలూ రోకలీ! సుఖంగా గుర్రు పెట్టే చాన్సు లేకపోగా కప్పుపగిలి మీదకూలి చస్తామేమోనని భయం పట్టుకుంది. ఈ విష యాన్ని ఇంటావిడకు ఎంతో నమ్రతగా విన్న వించుకున్నాడు.

"దానికి నన్నేం చేయమంటావు నాయనా! నువ్వూ నీ భార్యాకూడా రెండు పోర్షనులూ చూసుకున్నారుగదా! పై పోర్షనయితే నీళ్ళు చేదేసుకోడం కష్టమని నువ్వేగా కింద పోర్షన్ తీసుకొన్నావు. నీ తర్వాత వచ్చినవాళ్ళేగదా పైవాళ్ళు. వాళ్ళు నీళ్ళబాధ భరిస్తున్నారు. నువ్వు రోలూ రోకలీబాధ భరించు" అంటూ తీర్పిచ్చిందావిడ. కిక్కురుమనకుండా వెళ్ళి పోయాడు కృష్ణమూర్తి.

రెండ్రోజులు తిరక్కుండానే ఇల్లు ఖాళీ చేసేశాడు.

రెండో ఇల్లు : ఆరు సంసారాలుగల చిన్న సత్రంలాటి ఇల్లు. ఉద్యోగంలేని సినిమా అసి స్టెంటు డైరెక్టరూ, పంటలుచేసుకు బతికేవాడూ, బట్టలకొట్టు గుమాస్తా, శివావిష్ణు కోవెలముందు జంధ్యాలమ్ముకొనే బ్రాహ్మడూ, చెట్టుకింద జోస్యంచెప్పేవాడూ కాపురం వుండేవాళ్ళు తలవాక గదిలోనూ! ఒక్క కృష్ణమూర్తి పోర్షనే పెద్దది. దానికి రెండుగదులున్నాయి.

ఉదయం లేవగానే కృష్ణమూర్తి భార్య తలుపు తెరిస్తే ఎదురుగా కనబడేది ఒక క్యూ- ఆడవాళ్ళది! అనగా పైన చెప్పబడిన మొగ పురుషుల భార్యలది! ఒకరిచేతిలో గిన్నె, ఒకరి

చేతిలో గరిట, ఒకరిచేతిలో స్టోల—ఇలా తల చౌక ఆయుధం. కాఫీపొడుము, పంచదార, బియ్యం, నూనె, మిరపకాయలు వాళ్ళకక్కర లసిన వస్తువులు-అప్పుగానే.

తీరా ఇస్తే "ఈ జన్మలో మీ ఋణం దీర్చుకోలేమండీ" అనిమనస్ఫూర్తిగా కృతజ్ఞత వెలిబుచ్చేవారు. అదే మాటమీద నిలబడేవారు కూడా!

మరీ దానకర్ణుడనిపించుకోవడం కష్టమని ఎంచి ఆ యిల్లూ ఖాళీ చేశాడు నెల తిర క్కుండానే.

మూడో యింట్లో పట్టుకోడానికి వీల్లేని లంగా బాడీల దొంగలు. నాలుగో ఇంట్లో-కృష్ణమూర్తిని ఇంటివారి కుక్క కరిచింది. ఆ విషయంలో వీళ్ళకి వాళ్ళకి ఘోర యుద్ధమైన సందర్భంలో కృష్ణమూర్తి భార్య ఇంటావిడ ముక్కు కొరికేసింది. తత్ఫలితంగా 24 గంటల్లో ఆ యిల్లు ఖాళీ చేశాడు.

* * *

కృష్ణమూర్తి సినిమా నుంచి ఇంటికి తిరిగొచ్చేసరికి రాత్రి పదిగంటలైంది. ముందు గదిలో ఒక 22 ఏళ్ళ అయిదున్నర అడుగుల మొగశాల్తీ ఒకటి చాపమీద పడుకుని గట్టిగా గుర్రు పెడ్తోంది.

ఖూనీలు చేసేవాడిలాగా మాసిపోయిన గళ్ళలుంగీ, గారడీ సాయిబు మీసంలాటి మీసం, దుమ్ము కొట్టుకుపోయిన తల, చామన చాయగా వున్నాడు. చటుక్కున ఇందాకటి కాకి జ్ఞాపకం వచ్చింది.

"ఎవరబ్బా వీడు?" అనుకుంటూ వంట యింట్లో ప్రవేశించాడు. భార్య కమల చారులో తిరగమూత పెడుతోంది.

"ఎవరోయ్ ఆ శాల్తీ? మీ బ్రదరా?" అనడిగాడు.

"అతను చెప్పిన మాటలు నిజమైతే అలాటివాడే!" అంది కమల.

"ఏ వూరు?"

"బందరట."

"ఏ పేట?"

"కొజ్జిల్లి పేటట."

"కొజ్జిల్లిపేటా?"

"మరే! గుణుపూడి పిచ్చమ్మగారి కొడుకటగా?"

"శ్ . ఓ హో హో హో! అదా విషయం? పిచ్చమ్మగారంటే మా మేనమామ భార్యకి అక్కగారులే! ఎప్పుడయినా నేను వాళ్ళ వూరు వెళ్తే చాలా ప్రేమగా చూసేది. భలే మంచిది. 'మాంచి' అంటే ఇంతా అంతా 'మాంచి' కాదు. ఆవిడ హిస్టరీ చెప్పనా? పాపం.. తెల్లగా వుంటుంది. ముద్దపప్పు భలేగా వండుతుందిలే. పొట్టిగా వుంటుంది. అయితే ఏం? సినిమా పాటలదర కొట్టేస్తుంది. జుట్టు? చీలమండల దాకా వుంటుంది. యమస్పీడుగా నడుస్తుంది. చక్రాల్లాటి కళ్ళు-శనివారం శనివారం భజన చేస్తుంది.

కమల గుడ్లప్పగించి చూస్తోంది యీ తలా తోకా లేని వాగుడేమిటా? అని!

అది కనిపెట్టాడు కృష్ణమూర్తి.

"అలా చూస్తావేమిటోయ్? నే చెప్పే

దబద్దమనా? ఇంకా చెప్తా చూడు..." అంటుండగానే—

"నమస్కారం శ్రీశ్రీశ్రీ బావగారూ" అంటూ వచ్చి సాష్టాంగపడింది కొత్తశాస్త్రీ!

కప్పని తొక్కినట్టదిరి పడ్డాడు కృష్ణమూర్తి. అంత లోనే తమాయించుకుని, "భలే వాడివి! లేవయ్యా!" అంటూ లేవదీసి, "ఇదిగో! ఇలాటి నమస్కారాలూ గిమస్కారాలూ మనకినచ్చవ్. ఇప్పుడే చెప్తున్నా! మళ్ళీ నమస్కారం పెట్టావా? పెద్దవాణ్ణి నేనూ నీకు నమస్కారం పెట్టేస్తా! దెబ్బతో నీకాయుక్షీణం కలుగుతుంది జాగ్రత్త" అంటూ హెచ్చరించాడు.

నోట మాటరాక అలాగే చూస్తూండిపోయాడా శాస్త్రీ.

"కూర్చో" అన్నాడు కృష్ణమూర్తి.

కూర్చుంది శాస్త్రీ.

"చూడు! నీ హిస్టరీ, జాగ్రఫీ అంతా నాకు తెలిసిపోయింది. ఇక్కడంతా క్షేమం. అక్కడంతా క్షేమమేనా?" అన్నాడు కృష్ణమూర్తి.

"ఆఁ! క్షేమమేనండి."

అందా శాస్త్రీ.

"మీ నాన్నగారేం చేస్తున్నారు?"

"ఆయన పోయారండి" దిగులుగాచెప్పాడు శాస్త్రీ.

"మరంతా కులాసేనంటావేమయ్యా మైల కబురు చెప్పి?"

"ఆయనపోయి నాలుగేళ్ళయిందండి."

"ఓహోహో! అయితే మైల వెళ్ళిపోయిందన్నమాట! హార్దికండొలెన్సెస్."

"థాంక్స్."

"ఇంతకీ నీ పేరు?"

"గుర్నాధం."

"వృత్తి?"

"ఇంకా ఏం లేదండి! దానికోసమే ఇంటర్వ్యూకి ఇక్కడికొచ్చాను. రేపే ఇంటర్వ్యూ! హోటల్లో ఉండగే శక్తిలేక...." అంటూ చేతులు నలుపుకున్నాడు గుర్నాధం.

"భలేవాడవయ్యా! ఈ కాస్త భాగ్యం కోసం మళ్ళీ హోటళ్ళూ సత్రాలూ ఎందుకు? ఇక్కడే వుండు. ఇక్కడే ఛోంచెయ్యి."

"హిహిహి.. ఫర్వాలేదండి. భోజనం హోటల్లో చేస్తాలెండి!"

"మొహమాట పడ్తావేమయ్యా? నాన్సెన్స్. అలాటివేవీ పెట్టుకోకు. ఇది నీ సొంత యిల్లుగా భావించుకో. తెల్సిందా?"

"అ లా . గే....నం . డ... "

"కమలా! నీ బ్రదరు! జాగ్రత్తగా చూస్కో! ఏ లోటూ రాగూడదు! వడ్డించెయ్ ఇద్దరికీ" అంటూ ఆర్డరేశాడు కృష్ణమూర్తి.

ఇద్దరూ భోంచేశారు.

కృష్ణమూర్తి సిగరెట్ కొల్చబోతూ "సిగరెట్ కాలుస్తావుటయ్యా?" అనడిగాడు గుర్నాధాన్ని.

"అబ్బె వద్దండి" అంటూ సిగ్గుపడ్డాడు గుర్నాధం.

కృష్ణమూర్తి కర్థమైంది. కాలుస్తాడుగానీ భయమో, సిగ్గో, మొహమాటమో పడుతున్నాడని.

"అబ్బాయ్! సిగరెట్ కాల్చడం పెద్ద నేరమేం కాదు. నిన్నెవరూ జెయిల్లో పెట్టరు. కాల్చు" అంటూ ఒక సిగరెట్ అందించాడు.

గుర్నాధం మూడు గుక్కల్లో ఊది పారేశాడు.

తర్వాత ఆ కబుర్లూ ఈ కబుర్లూ మాట్లాడుకుని పడుకోడానికి నిశ్చయించుకున్నారు. గుర్నాధానికి ముందు గదిలో పడక ఏర్పాటు చేసింది కమల. దాని తర్వాత గదిలో కృష్ణమూర్తి, కమల టేబుల్ ఫాన్ పెట్టుకు పడుకున్నారు.

మద్రాసు మహానగరంలో పాతమాంబళానికి ప్రత్యేకమైన స్థానం వుంది. ప్రశస్తమైన దోమలిక్కడ విరివిగా ఉత్పత్తి యగును. దోమతెరలుగానీ, ఫాన్లుగానీ లేకుండా నిద్ర పోవడం చాలా కష్టం.

రెండూ లేని కారణాన గుర్నాధానికదే కష్టమొచ్చి పడింది. దీనికి తోడు బాత్‌రూం కెళ్ళవలసి వచ్చింది. గబగబా వెళ్ళి కృష్ణమూర్తి రూం తలుపు తట్టాడు.

చేయబోయే 'మన్మధ వ్రతానికి' 'విఘ్నేశ్వర పూజ' చేసుకుంటున్న ఆ దంపతులదిరిపడి లేచారు.

"ఇదేం ఖర్మరా దేవుడా!" అని మనసులో అనుకుంటూనే తలుపు తీశాడు కృష్ణమూర్తి.

"బావగారూ! దోమలు నన్ను తినేస్తున్నాయండీ! నిద్ర పట్టడంలేదు. ఒక్క సిగరెట్ ఇస్తారా?" అనడిగాడు.

ఇచ్చాడు కృష్ణమూర్తి మౌనంగా.

అది వెలిగించుకుని బాత్‌రూమ్ కెళ్ళాడు గుర్నాధం.

దంపతులు ఒకళ్ళనొకళ్ళు చూసుకుంటూ నవ్వాలేని ఏడ్వాలేని పరిస్థితిలో పడ్డారు.

గుర్నాధం తిరిగొచ్చి, ఇద్దరి మధ్యా తిష్ట వేసి, "దోమలు-వానివలన బాధలు" అనే అంశం మీద ఉపన్యాసం మొదలెట్టేడు- మధ్య మధ్య కృష్ణమూర్తి దగ్గర సిగరెట్ లాక్కుంటూ.

చివర్లో దోమలబాధా నివారణోపాయాలు కొన్ని ఏకరువు పెట్టాడు. వాటిల్లో వంటికి కిరసనాయిలు రాసుకు పడుకోడం అనే ఉపాయం కూడా వుంది.

దోమల బాధకన్నా గుర్నాధం బాధెక్కువయింది దంపతులకి.

"పోనీ కాస్త కిరసనాయిలు రాచుకు పడుకుంటావేమిటి?" అనడిగాడు కృష్ణమూర్తి.

"అబ్బెబ్బే! అది నా వంటికి ఎలర్జీ అండీ! తెల్లారేసరికి ఒళ్ళంతా దద్దుర్లొచ్చేస్తాయి. మళ్ళీ డాక్టర్ల ఖర్చూ, మందుల ఖర్చూ! నాకు టేబిల్ ఫానిచ్చేసి, మీరు కిరసనాయిలు వాడుకోండి" అంటూ ఫాన్ పట్టుకుపోయి హాయిగా పెట్టుకు పడుకున్నాడు గుర్నాధం.

దంపతులు కిరసనాయిలు రాచుకుని ఆ వాసన భరించలేక రెండుసార్లు డోక్కుని, నిద్రపట్టక ఎల్లాగో తెల్లవార్చారు. ముందు స్నానం చేస్తేగాని కాలకృత్యాలు కూడా తీర్చుకోలేకపోయారు పాపం!

ఉదయం కాఫీ తాగాక కాస్త పచారి దుకాణానికి వెళ్ళి రమ్మంది కమల-కృష్ణమూర్తితో.

"నేనూ వస్తాను బావగారూ!" అంటూ వెంటబడ్డాడు గుర్నాధం.

సరుకులు తీసుకుని, కాతాలో రాసుకోమని చెప్పి, బయల్దేరబోతూండగా "ఒక్క వక్క పొడి పొట్లం ఇయ్యి బాబూ!" అన్నాడు గుర్నాధం కొట్టువాడితో.

వాడిచ్చాడు.

గుర్నాధం డబ్బివ్వాలని జేబులో చెయ్యి పెట్టేడు.

"ఛ ఛ! నువ్వెందుకయ్యా ఇవ్వడం? కాతాలో రాసుకుంటాళ్లే! ఇంకేమైనా కావాలంటే తీసుకో" అన్నాడు దర్జాగా.

అంతే—ఒక హెయిరాయిల్ సీసా, దువ్వెన, రేజర్ సెట్టు, బ్లేళ్ళకట్ట, పౌడరు డబ్బా, రెండు సిగరెట్ పెట్టెలు తీసేసుకున్నాడు గుర్నాధం.

కృష్ణమూర్తికి గూబదిరిపోయింది. కాని చేసేదేముంది? మర్యాద, ఆత్మగౌరవం ముఖ్యం గదా.

*　　*　　*

గుర్నాధం ఇంటర్వ్యూకి వెళ్ళే టైమైంది.

"బావగారూ! ఒక్క జత లాగూ చొక్కా ఉంటే యిస్తారా? ఇంటర్వ్యూ నుంచి వచ్చి మళ్ళీ ఇచ్చేస్తాను" అన్నాడు గుర్నాధం.

కృష్ణమూర్తి "అలాగే" అంటూ అలమరా తెరిచాడు దిగులుగా. గుర్నాధం తనక్కావలసిన మేలైన గుడ్డలు తనే ఎంచుకున్నాడు. పైపెచ్చు కృష్ణమూర్తి కొత్త బూట్లు కూడా తొడుక్కెళ్ళాడు. కృష్ణమూర్తి నగ్నకాలుతో ఆఫీసు కెళ్ళాలి పొచ్చింది.

కమల అతన్ని చూసి నవ్వుకుంది.

గుర్నాధం ఇంటర్వ్యూ అయ్యేసరికి సాయంత్రం 4 గంటలైంది. తిరిగి వస్తూ దారిలో పార్కుకెళ్ళాడు. అయిదారు గంటల్నుంచీ కాళ్లు బూట్లలోనే కాపురం చెయ్యడం వల్ల వేడెక్కిపోయాయి. గబ గబా బూట్లు విడిచి, కాళ్ళకు చల్లగాలి తగులుతుంటే "అమ్మయ్య" అనుకున్నాడు. ఇంతలో అతని కంటికి నీటి కుండీ ఒకటి కన్పించింది. వెంటనే బూట్లు మోసుకుంటూ అక్కడి

కెళ్ళి, వాటిని కిందపడేసి, తన పాదాలు నీటిలో దిగేసి, కుండీ గట్టుమీద కూర్చుని సిగరెట్ కాలుస్తూ ఆనందపరవశుడయ్యాడు.

కాసేపట్లో రెండుకుక్కలు దెబ్బలాడు కుంటున్న అరుపులువిని వెనక్కి తిరిగిచూసేడు. ఒక కొత్తబూటుకోసం ఆ దెబ్బలాట! గభాల్న కిందికి చూశాడు. ఒకబూటే వుంది. గుండె దడదడ లాడింది. అయినా బోలెడంత కోపం వచ్చేసింది. క్రిందిబూటు చంకలో పెట్టుకొని, చిన్నప్పుడు వాళ్ళమ్మమ్మగారి ఊళ్ళో గొడ్డకాటి బుడ్డాళ్ళ దగ్గర నేర్చుకున్న ముద్దయినబూతులు తిడుతూ రాళ్ళుపుచ్చుకుని కుక్కలవెంట బడ్డాడు. ఒకటి పారిపోయిందిగాని, రెండోది మాత్రం బూటు నోటకరచుకుని అటూయిటూ పరిగెత్తి పార్కుకు కంచెగా వేసిన ముళ్ళతీగల సందులోంచి దూరి బజార్నపడింది. గుర్నాధం కూడా ఆవేశంతో అదేపనికి పూనుకోవడం వల్ల లాగూ చొక్కాలు ముళ్ళతీగలకు పట్టుకొని పర్రున చిరిగాయి. అయినా అదేమీ పట్టించుకోకుండా కుక్కవేట సాగించాడు నిండు బజార్లో! ఈవేట ఫలితంగా ఒక కాంగ్రెసు జెండా కారూ, మరో జనతాజెండా కారూ ప్రేమతో ముద్దెట్టుకున్నాయి. పరమ నిష్టా గరిష్టుడైన బ్రాహ్మణుడొకడు చెప్పులు కుట్టు కుంటున్న హరిజనుడిమీద పడి ఆప్యాయంగా కావిలించుకున్నాడు. ఒక సాహెబు హిందూ దేవుళ్ళ పటాలమ్మే షాపుముందు సాష్టాంగ పడ్డాడు. ఒక రొయ్యలబుట్ట మరో చింతచిగురు కుప్పమీద బోర్లాపడింది. పత్రికల్లో వంటలూ వార్పులూ రాసే లావుపాటి లతాదేవి కూర గాయలు షాపుమీదపడి గుమ్మడి కాయల్ని పప్పుచేసింది, షాపువాణ్ణి పచ్చడి చేసింది.

గుర్నాధం రొట్టెవిరిగి నేతిలో పడింది. అతను మురికాల్వలో పడ్డాడు. వెదకబోయిన తీగె కాళ్ళకు తగలింది. చిరిగిన బూటు చేతికి తగిలింది.

విజయలక్ష్మీ సమేతుడై ఇంటికి నడిచాడు.

* * *

గుర్నాధం చెప్పిన వృత్తాంతం విన్న కృష్ణమూర్తికి "నవ్వు, ఏడుపు, కోపం" అనే త్రిరసాలలో దేన్నభినయించాలో తెలియలేదు. మర్యాద ఆత్మగౌరవం అనేవి అన్ని రసాల్నీ మింగేశాయి.

కమల మాత్రం కించిత్తు కోపాన్నభినయించి "సరే! అయిందేదో అయింది! బజారెళ్ళి ఆ బూటు బాగుచేయించి మూలబెట్టు" అంది— గుర్నాధాని కదే శాస్తి అన్నట్టు.

"అలాగే అక్కగారూ!" అని గుర్నాధం బాత్‌రూంలో జొరబడి, షాంపూసీసా ఖాళీచేసి తలంటు పోసుకుని, మురికి గుడ్డలకి పూర్తి బార్‌సోపు పట్టించి, తన లాగూ చొక్కాలు తొడుక్కుని, డబ్బులడిగి తీసుకుని, బూటు పుచ్చుకుని బజారు బయల్దేరాడు. వెళ్ళేప్పుడు కృష్ణమూర్తి సైకిల్ కనబడింది.

"సైకిలేసుకెళ్తా బావగారూ!" అంటూ ముచ్చటపడ్డాడు.

కృష్ణమూర్తి మౌనంగా అతనివేపు అర్ధం లేని చూపొకటి విసిరాడు.

"మౌనం అర్ధాంగీకారం" అని తెలిసిన గుర్నాధం సైకిలేసుకుని ఝామ్మనెళ్ళిపోయేడు.

బూట్ల రిపేర్ షాపుముందు సైకిలు నిలబెట్టి, లోపలికెళ్ళి అర్జంటుగా బాగుచేస్తేగాని వీల్లేదన్నాడు. వాడు చార్జెస్ ఎక్కువచెప్పాడు. అయినా సరేనని వాడిపీకలమీద కూర్చున్నాడు.

వాడు రిపేరు చేసిచ్చేసరికి పూర్తిగా చీకటి పడిపోయింది. రిపేరయిన బూటుచూసుకుని సంతృప్తిచెంది, డబ్బులిద్దామని పాంటుజేబిలో చెయ్యిపెడితే డబ్బులేదుగాని, జేబులో పెద్ద చిల్లిమాత్రం వుంది. పోయిన డబ్బునూ, చిల్లిగల పాంటుకూ అష్టోత్తర శతనామావళి చదివి, "డబ్బు రేపిస్తాను, బూటిచ్చెయ్యి"మని రిపేరర్‌ని బ్రతిమాలాడు. వాడు వీల్లేదు పొమ్మన్నాడు.

మనసులో వాడ్నొక పదిబూతులు తిట్టుకుని బయటకొచ్చాడు సైకిల్ దగ్గరకు. దానిలైట్ మాయమైంది.

తనకిన్ని కష్టాలు ఒకేరోజున తెచ్చిపెట్టినందుకు తన ఇష్టదైవానికి సహస్రనామావళి

చదువుతూ, సైకిలెక్కి ఇంటికి బయలదేరాడు. ఒక ఫర్లాంగయినా వెళ్ళకముందే పోలీసొకడు పట్టుకున్నాడు. పేరూ అడ్రసూ చెప్పమన్నాడు. బందర్లోలాగ తెలుగులో దబాయించబోయాడు. లాభంలేక పోయింది. ఇంగ్లీషులో బ్రతిమాల బోయాడు. భాష కుదర్లేదు. ఇహ గత్యంతరం లేక కృష్ణమూర్తి పేరూ అడ్రసూ చెప్పాడు. (వేరే దురుద్దేశమేమీలేదు. కృష్ణమూర్తిఇక్కడి వాడేగదా! కాస్త ఇన్‌ఫ్లూయన్స్ వుండి వుంటుంది. కేసులోంచి తేలిగ్గా బయటపడగలడు అనే నమ్మకం పాపం!)

పోలీసు వివరాలు రాసుకుని, మర్నాడు పొద్దున్నే 7 గంటలకల్లా సైదాపేట కోర్టుకు రమ్మని ఆర్డరేసి పోయాడు.

మళ్ళీ సైకిలెక్కకుండా కాళ్ళీడ్చుకుంటూ వచ్చి ద్వితీయ వృత్తాంతం చెప్పాడు దంపతులకి.

"సారీ బావగారూ! సారీ అక్కయ్యగారూ" అని కళ్ళవెంట నీళ్లు కూడా పెట్టుకున్నాడు.

క్షమించి వూర్కోడంతన్నా వాళ్లేమీ చేయలేకపోయారు.

కృష్ణమూర్తి స్వయంగా వెళ్ళి బూటు విడిపించుకొచ్చాడు.

మర్నాడు వుదయమే కోర్టు వెళ్ళాడు.

"నిన్న రాత్రి 7 గంటల వేళ సైకిలుకు లైటు లేకుండా తొక్కావా?" అనడిగాడు మేజిస్ట్రేటు.

"ఎస్ సార్!" అన్నాడు గిల్టీగా.

"నీ వుద్యోగం?"

"ఎ బి సి డి కంపెనీలో క్లర్కు."

"రెండు రూపాయలు ఫైను."

"ఎక్స్క్యూజ్‌మీ సార్!.... ఇంకెప్పుడూ" అని ప్రాధేయపడబోయాడు కృష్ణమూర్తి.

"నాన్సెన్స్ 4 రూపాయలు" అన్నాడు కోపంతో మేజిస్ట్రేటు.

చచ్చినట్టు కట్టి బయటపడ్డాడు క్రిష్ణమూర్తి.

* * *

ఇంటి ఖామందు వరండాలో కూర్చుని అప్పుడే వచ్చిన 'హిందూ' పేపరు తిరగేస్తున్నాడు. "నమస్కారమండీ" అనేమాట విని తలెత్తి చూశాడు.

గుర్నాధం ఇకిలిస్తూ నిలబడి వున్నాడు.

"ఎవరు బాబూ నువ్వు?" అడిగాడు ఖామందు.

గుర్నాధం తన వివరాలన్నీ చెప్పేసి, "ఉద్యోగమేదన్నా ఇప్పించంది సార్! మీకు పుణ్యముంటుంది" అన్నాడు.

"నేనేం యిప్పించగలన్నాయనా? ఈ పేపర్లో ఉద్యోగాలకి చాలా ప్రకటనలు పడ్తూంటాయి. చూసి అప్లయ్ చెయ్యి! పది రాళ్లు విసిరితే ఒక్కటయినా తగలకపోతుందా?" అంటూ పేపరందించాడు ఖామందు.

గుర్నాధం బైఠాయించి ఉద్యోగప్రకటనలు వెదకడం మొదలు పెట్టేడు.

"ఒరే రాజీగా!" అని ఇంట్లోకి చూస్తూ పిల్చాడు ఖామందు.

"ఇదిగో వస్తున్నా డాడీ!" అంటూ ఒక ఆడగొంతు వినబడి, ఆ వెంటనే ఒక విగ్రహం కూడా ప్రవేశించింది కాఫీ గ్లాసుతో.

గుర్నాధం తలెత్తి చూశాడు.

18 ఏళ్ళ కన్యావిగ్రహం! పువ్వుల లుంగీ కట్టుకుని, గళ్ళ స్లాక్ తొడుక్కుని పొట్టి జుట్టు విరబోసుకుని వుంది. మెళ్లో ముత్యాల హారం. ఆ పిల్ల కూడా గుర్నాధంవంకే కళ్ళార్పకుండా చూస్తూ నిలబడిపోయింది. ఖామందు ఆమె చేతుల్లో గ్లాసందుకుని "అలా చూస్తావేరా లక్ష్మీకొడకా! అతను మనవాడేలేవే! మన కృష్ణమూర్తి బావమరది!....మరోగ్లాసుడు కాఫీ పట్రా పంచదారవేసి" అన్నాడు కూతురితో.

"అలాగే డాడీ" అంటూ లోపలికెళ్ళిందా పిల్ల.

"మా అమ్మాయయ్యా గుర్నాధం! పేరు రాజేశ్వరి. బి. ఏ. చదువుతోంది. లేకలేక పుట్టిన ఒక్కగానొక్క పిల్లకావడంవల్ల దాన్ని మొగాడిలాగే పెంచుతూ, కొడుకులులేని కొరత తీర్చుకుంటున్నా నన్నమాట" అన్నాడు ఖామందు.

"బావుందండీ! చాలా బావుంది! 'లక్ష్మీ కొడకా' అని పిలవడం మరీ ముద్దుగా వుంది. "తొత్తుకొడకా" అనే మాటకూడా ట్రైచేసి చూడండి మోతగా వుంటుంది" అంటూనవ్వాడు గుర్నాధం.

"పిచ్చోడా? ఆమాట వదిలి పెట్టానటయ్యా! అదేకాదు! 'గాడిద కొడకా' అనికూడా పిలుస్తూంటాను. ఇవి కాదుగానీ, మరేదయినా కొత్తమాట సూచించు" అన్నాడు ఖామందు.

"ఆలోచించి చెప్తానండి" అన్నాడు గుర్నాధం.

ఇంతలో రాజేశ్వరి వచ్చి, గుర్నాధానికి కాఫీయిస్తూ "ఏ వూరండీ మీది?" అనడిగింది.

"బందరండి" అన్నాడు గుర్నాధం.

"హబ్బ! బందరా!....డాడీ....నాకు బందర్లడ్డూలు తినాలనిపిస్తోంది" అంది చొల్లుకార్చబోతూ.

"ఛ! గాడ్దికొడకా! ఇప్పటికిప్పుడు బందర్లడ్డెక్కడ్నించొస్తాయి?" అని ముద్దుగా మందలించాడు ఖామందు.

"పోన్లెండి పాపం! పాప ముచ్చట పడ్తూ వుంది. కావాలంటే నేనుచేసి పెట్తాను"అన్నాడు గుర్నాధం.

ఖామందు అదిరిపడ్డా డాశ్చర్యంతో.

"ఏమిటీ? నీకు పిండివంటల్లోకూడా ప్రవేశ ముందా?"

"ఓ యస్! పిండివంటలు, పెళ్ళివంటలు, తద్దినం వంటలు—ఏవయినా సరే! బస్తీమే సవాల్!" అన్నాడు గుర్నాధం మీసం మెలి పెడుతూ.

"ఒర్నీ అసాధ్యం కూల! శుభం! మరి బందరు లడ్డూలతో మొదలుపెట్టు నీ కార్యక్రమం" అన్నాడు ఖామందు.

"అలాగేనండి! పాపకేం కావాలో అదల్లా చేసి పెడతాను....ఓకే?" అంటూ రాజేశ్వరి వంక చూశాడు.

"థాంక్యూ" అంటూ రాజేశ్వరి అతన్ని మనసులో మెచ్చేసుకుంది.

అప్పటివరకూ లోపల నిలబడి వింటున్న ఖామందు భార్య పార్వతి గుమ్మంలోంచి తల బయటపెట్టి భర్తతో "రాబోయే తద్దినం కాస్త గట్టెక్కించమని చెప్పండతనితో" అంది.

"మీ తద్దినం గురించి మీరేం భయపడ కండమ్మా! నేనున్నానుగా" అభయ హస్తం చూపించాడు గుర్నాధం.

అక్కణ్నుంచి పన్లు చకచక జరిగాయి.

సాయంత్రానికి బందరు లడ్లు తయారయ్యాయి.

ఖామందు కృష్ణమూర్తినీ, అతని భార్యనీ కూడా ఆహ్వానించాడు. గుర్నాధమే అందరికీ లడ్డు ప్లేటలో పెట్టిచ్చాడు—(ఖామందుకి తప్ప) అద్భుతంగా కుదిరాయి లడ్లు. లొట్టలేసుకు తింటూ గుర్నాధం పనితనాన్ని తెగపొగడ్డం మొదలెట్టారందరూ.

కృష్ణమూర్తికి చిన్న జోక్ వెయ్యాలనిపించింది.

"ఏమోయ్ గుర్నాధం! ఇల్లు కట్టుకోవాలనుకుంటున్నాం! గృహప్రవేశానికి నువ్వుతప్పకుండా రావాలి. కాస్త వంటాగింటా" అంటూ సాగదీశాడు.

"అమ్మమ్మ! అదేంమాట బావగారూ! అసలు మీ యింటికి మొదట ఎసరు పెట్టేదే నేను" అన్నాడు గుర్నాధం.

"ఆ చేత్తోనే మా అమ్మాయి పెళ్ళికూడ కాస్త వెళ్ళమార్చు నాయనా! బాగా ఘనంగా చేద్దామనుకుంటున్నాం" అంది ఖామందు భార్య పార్వతమ్మ.

"అదేం మాటండీ! అసలు నేను లేకుండా మీ అమ్మాయి పెళ్ళి జరగడమే?" అన్నాడు గుర్నాధం నవ్వుతూ.

అంతా గొల్లుమని నవ్వారు.

రాజేశ్వరి మళ్ళీ నాలుగు లడ్లు పెట్టించుకు తింది.

కూతురు తృప్తిగా తినడంచూసి ఖామందుగారి కానందమయింది.

"ఏరా తొత్తుకొడకా! ఇవాళ లడ్లయ్యాయి! రేపేమిటి?" అనడిగాడు కూతుర్ని.

"రేపా?....రేపూ....ఇవాళివి పంచదారతో



చేశారుగా. రేపు బెల్లంతో .. బెల్లంతో మీ యిష్టమొచ్చినది చేసెయ్యండి గుర్నాధంగారూ" అంది రాజేశ్వరి గుడ్లుతిప్పుతూ.

"ఓయస్! చూడండి మన తడాకా" అన్నాడు గుర్నాధం.

పార్టీ ముగిసింది.

అక్కణ్ణించీ గుర్నాధం కార్యక్రమం ఒక రకంగా ఏర్పాటయింది. పొద్దున్నే కృష్ణమూర్తి ఇంట్లో కాఫీ తాగడం—ఖామందు గారింటిలో పేపర్లో ఉద్యోగ ప్రకటనలు చూడ్డం—కృష్ణమూర్తి కాతాలో పోస్టుకవర్లూ, (కొట్లో యివీ దొరుకుతాయి మరోపైసా అదనంగా) తెల్ల కాగితాలూ తెచ్చుకుని అప్లికేషన్లు పెట్టడం—మధ్యాహ్నం భోంచేసి నిద్రపోవడం—4 గంటలకు లేచి టిఫిన్ కాఫీలారగించడం — కాలేజీ నుంచి రాజేశ్వరి రాగానే వాళ్ళింట్లో జొరబడి బాతాఖానీ, కారంబోర్డు, మాగజైన్లు వగైరాలతో కాలక్షేపం—రాత్రి 9 గంటలకు భోజనం. తర్వాత ఫాన్‌లో నిద్ర. శని ఆదివారాలలో ఖామందు గారింట్లో పిండివంటలు చేయటం వారి ప్రశంసలు పొందడం—

ఒకనాడు కృష్ణమూర్తి భార్య విడిచిన చీరె దండెంమీదనుంచి కింద పడిపోయింది. గుర్నాధం సిగరెట్టు కాలుస్తూ అప్లికేషన్లు రాస్తున్నాడు. సిగరెట్ చివరకి వచ్చింది. దాన్ని ఎటు విసిరేస్తున్నాడోకూడా తెలియకుండా విసిరాడు. అది చీరమీదపడి తగల బెట్టింది.

కమల భర్తతో చెప్పుకు కుళ్ళికుళ్ళి ఏడ్చింది. అతనామెను శాంతంగా వుండమని ఓదార్చాడు.

మరోనాడు ట్యూబ్‌లైటు వెలగలేదు. దాన్ని మళ్ళీ వెలిగిద్దామనే ప్రయత్నంలో పగల గొట్టేశాడు గుర్నాధం.

"చేతకాని పని నీ కెందుకయ్యా?" అని మాత్రం మందలించగలిగాడు కృష్ణమూర్తి. ఇంకోనాడు హెయిరాయిల్ చేతిలోకి వంచు కుంటుండగా కొంత క్రింద ఒలికిపోయింది.

ఒలికిపోయినదాన్ని తుడిచేయడం మర్చిపోయాడు గుర్నాధం. కుక్క వంటింట్లో జొరబడిందనే హడావిడిలో పరుగెత్తి కాలు హెయిరాయిల్ మీదవేసి జారిపడి చట్ట విరగగొట్టుకుంది కమల! దాంతో, వాపులూ, తీపులూ వైద్యాలూ....

కొత్తాకొట్లో లెక్క మొక్కబడి జుట్టులా పెరిగిపోతోంది.

కృష్ణమూర్తి దంపతులుకి శనిగాణ్ణి భరించడం చాలా కష్టమయిపోతోంది. వెళ్ళిపొమ్మని చెప్పలేరు. గట్టిగా తిట్టలేరు. ఏమీ తోచక మొదట్లో చూపించిన ఆప్యాయత తగ్గించి ముభావంగా వుండసాగారు. కాని గుర్నాధం మాత్రం అడిగయినా సరే తన కోరికలు నెరవేర్చుకుంటున్నాడు. వాళ్ళకి లోపల మరింత మండిపోతోంది.

ఖామండుకీ, పార్వతికికూడా రోజులు గడుస్తున్నకొద్దీ గుర్నాధం పెద్ద తలనొప్పిగా తయారయ్యాడు. పరీక్షలు దగ్గరకొస్తున్నా రాజేశ్వరి చదువుకు నామం పెట్టేసి గుర్నాధంతో కాలక్షేపం చేసేది. కూతుర్ని మందలించి చూశారు. లాభం లేకపోయింది. చూసిచూసి ఒకరోజు గుర్నాధాన్ని షికారుకు పిల్చుకుపోయి "బాబూ! అమ్మాయి పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. ఇప్పట్నుంచే చదవకపోతే లాభంలేదు. నీతో కాలక్షేపం చెయ్యకుండా బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోమని బుద్ధిచెప్పు నాయనా" అంటూ బ్రతిమాలాడు ఖామందు. అంటే తనని వాళ్ళింటికి రావద్దని చెప్తున్నాడని అర్థమయింది గుర్నాధానికి.

"అలాగే సార్! తప్పకుండా చెప్తాను" అని ఒప్పేసుకుని, రాజేశ్వరితో ఆ మాటే చెప్పేశాడు ఇష్టంలేకపోయినా.

బలవంతంగా చదవడం మొదలు పెట్టింది రాజేశ్వరి.

గుర్నాధం సాయంకాలం బజారు షికార్లు మొదలు పెట్టాడు.

నాలుగు రోజులు గడిచాక ఒక రోజురాత్రి 8 గంటలకు రాచేశ్వరి పరుపు కింద నాలుగు మాగజైన్లు కనబడ్డాయి పార్వతమ్మకు. తీసి చూసింది. అసహ్యమైన బొమ్మలూ, అంతకన్నా అసహ్యమైన భాష!

రాజేశ్వరికి తెలియకుండా భర్తను పిల్చి చూపించింది. ఆయన మనస్సు కెలికినట్లయింది. భార్యను వంటింట్లోకి పంపి, రాజేశ్వరిని పిల్చి నిగ్గదీసి అడిగితే గుర్నాధం ఇచ్చాడని చెప్పింది. ఉగ్రుడై పోయడు.

కృష్ణమూర్తి పడక్కుర్చీలో పడుకుని, దూలాలు చూస్తూ ఈ గుర్నాధంగాడ్నెలా వదిలించుకోవాలీ అని ఆలోచిస్తున్నాడు.

ఖామందు హడావిడిగా వచ్చారు "కృష్ణమూర్తీ! మీ చుట్టమేడీ?" అంటూ.

"ఎక్కడికో వెళ్ళినట్టున్నాడండీ, ఏం?" అన్నాడు కృష్ణమూర్తి.

"ఏమిటీ బాబాయిగారూ?" అంటూ వచ్చింది కమల.

ఆడదాని ఎదట తన బాధ వెళ్ళబోసుకుని అల్లరైపోవడం యిష్టంలేక "ఏం లేదమ్మా" అని, కృష్ణమూర్తిని చూసి "కాస్త డాబామీదికెల్దాం రావయ్యా" అంటూ పిల్చికెళ్ళాడు.

డాబా మీద ఖామందు తన బాధంతా వెళ్ళబోసుకుని "నువ్వు వెంటనే మీ వాడ్ని తరిమేస్తావా లేక వాడ్ని చావగొట్టమంటావా?" అనడిగాడు.

కృష్ణమూర్తికి భయం వేసింది. "బాబ్బాబు ఆ పని మాత్రం చెయ్యకండి. మా చుట్టాల దగ్గర నా పరువు పోతుంది. ఎలాగో రేపు రాత్రి సర్కార్లో వాడ్ని పంపించేస్తాగా! నా మాట నమ్మండి! ఒట్టు" అని ప్రమాణం చేశాడు కృష్ణమూర్తి.

ఖామందుకి నమ్మకం చిక్కాక శాంతించి, "అబ్బబ్బ! ఈ పీడ ఎంత తొందరగా వదిత్తే అంత తొందరగా తిరుపతి వెళ్ళొద్దామని పిస్తోందయ్యా" అన్నాడు.

కృష్ణమూర్తి వెంటనే గుర్నాధంవల్ల తనక్కలిగిన బాధలన్నీ వివరంగా చెప్పి, "మీకే కాదు! నాక్కూడా అలాగే అనిపిస్తోంది. ఇద్దరం కలిసే వెళ్దాంలెండి. రండి

పోదాం" అన్నాడు కృష్ణమూర్తి.

ఇద్దరూ డాబా దిగిపోయారు.

డాబామీద ఒక గోడ పక్కగా నిలబడి వీళ్ళ సంభాషణంతా విన్న గుర్నాధం ఒక నిట్టూర్పు విడిచి తల పంకించాడు.

తెల్లారింది.

గుర్నాధం డ్రెస్సు వేసుకుని, సంచి చేత్తో పట్టుకుని "బావగారూ! నేను వెళ్లొస్తా" అన్నాడు కృష్ణమూర్తితో.

కృష్ణమూర్తి తన కళ్ళనీ చెవుల్నీ తానే నమ్మలేకపోయాడు. ఆశ్చర్యంగా 'ఆఁ' అని నోరు తెరిచి అలాగే వుండిపోయాడు.

"ఏమిటీ? అప్పుడే?" అంటూ వచ్చింది కమల.

"అవునక్కయ్యగారూ! వెళ్ళాలి. ఎన్నాళ్ళని మిమ్మల్నిబ్బంది పెట్టనూ? ఇహ ఇక్కడ వుద్యోగం దొరకదు. అక్కడే ఏదయినా ట్రై చేస్తా" అన్నాడు గుర్నాధం.

"ఛ ఛ! మాకేం యిబ్బందయ్యా?....ఐనా ఇప్పుడేనా? రాత్రి సర్కారుకు వెళ్ళచ్చుగా" అన్నాడు కృష్ణమూర్తి మనసులో ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతుండగా.

"ఇంకా రాత్రిదాకా ఎందుకూ? ఇప్పుడు జనతా ఎక్కానంటే రాత్రి కింటికి చేరుకుంటాను" అన్నాడు గుర్నాధం.

"సరే అలా అయితే! శుభం! వెళ్ళిరా" అంటూ గుర్నాధంతోబాటు వీధిలోకొచ్చి "మరి నే వుంటా! అప్పుడప్పుడూ వస్తూండు, ఉత్తరాలు రాస్తూండూ" అన్నాడు కృష్ణమూర్తి మాటవరసకి.

"అలాగే అలాగే" అంటూ గుర్నాధం వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత వచ్చిన శనివారమే రెండు దంపతులూ తిరపతెళ్ళి మొక్కు తీర్చుకొచ్చాయి.

మూడు నెలలు గిర్రున తిరిగాయి.

ఖామందు కృష్ణమూర్తి దగ్గరకు గుండెలు బాదుకుంటూ వచ్చాడు—

"నాకొంప మునిగిపోయింది కృష్ణమూర్తీ" అంటూ.

కృష్ణమూర్తికంతా అయోమయం. "ఏమైందండీ!" అన్నాడు.

"నా పరువు ప్రతిష్ఠ మంటగలిసిపోయాయి. ఇంక నేను తలెత్తుకు తిరగలేను. ఏ నుయ్యో గొయ్యో చూసుకోవలసిందే" అంటూ గొల్లు నేడ్చాడు ఖామందు.

"మీరు వూరికే అధైర్యపడకండి బాబూ! ఏం జరిగిందో చెప్పండి" అన్నాడు కృష్ణమూర్తి ఓదార్చుతూ.

"మా రాజిగాడు కడుపుతో వున్నాడు నాయనోయ్."

కృష్ణమూర్తి షాక్ తిన్నాడు. ఒక్క నిముషం అలాగే వుండిపోయి,

"ఎవరట?" అనడిగాడు రహస్యంగా.

"ఇంకెవ్వరు? ఆ దిక్కుమాలిన ముండాకొడుకు....మీ బావమరిది గుర్నాథంగాడేట" మళ్ళీ ఏడుపు.

కృష్ణమూర్తికి మరో షాక్.

"వాడు వెళ్ళిపోయాడు గదండీ! మళ్ళీ ఎప్పుడొచ్చాట్ట?"

"మనం తిరపతెళ్ళిన రోజునే తగలడ్డాట్ట తండ్రీ! పరీక్షలు గదాని మా రాజిగాడ్ని వదిలి పెట్టి వెళ్ళాం. లేకపోతే ఇంత ఘాయిత్యం జరిగేది కాదు నాయనోయ్" అంటూ మళ్ళీ రాగాలు పెట్టాడు.

కృష్ణమూర్తికీ బాధ కలిగింది. గుర్నాధంగాడ్ని చిత్రవధ చెయ్యాలనిపించింది. అంతలోనే ఖామందుని చూస్తే జాలేసింది—కాస్త ఆలోచించాడు.

"బాబూ! అధైర్యపడకండి. మనం వాళ్ళ వూరు వెళ్దాం. మనమ్మాయిని చేసుకోమని బ్రతిమాల్దాం. ఇంతకన్నా మరో గత్యంతరం లేదు మనకి. ఏమంటారు?" అన్నాడు కృష్ణమూర్తి.

"నీ ఇష్టం నాయనా! నా మానం, మర్యాదా నా బిడ్డ బ్రతుకూ ఎలా కాపాడతావో నీదే భారం" అంటూ చేతులెత్తి దణ్ణం పెట్టాడు ఖామందు.

వెంటనే ఇద్దరూ బందరు ప్రయాణమై వెళ్ళారు.

గుర్నాథం బందర్లో లేడు! హైద్రాబాద్‌లో ఏదో హోటల్లో సర్వరుగా ఉంటున్నాడని గుర్నాథం తల్లి పిచ్చమ్మ చెప్పింది. ఆడ్ర సిచ్చింది. కృష్ణమూర్తి ద్వారా విషయమంతా విని బాధపడి కొడుకుని తిట్టిపోసింది. వాడి కాళ్ళూ చేతులు విరగ్గొట్టయినాసరే పెళ్ళి జరిపించమంది.

కృష్ణమూర్తీ, ఖామందూ హైద్రాబాద్‌లో గుర్నాధాన్ని కలిశారు. కాళ్ళూ గడ్డమూ పట్టుకుని అతి దీనంగా బ్రతిమాలి, బహు కష్టం మీద పెళ్ళికి వప్పించారు—అయితే ఒక్క షరతు.

ఖామందుగారు తన యావదాస్తినీ పెళ్ళికి ముందే గుర్నాథం పేర వ్రాసేయాలి.

ఒప్పుకున్న ప్రకారం ఖామందు షరతును పాటించారు.

పెళ్ళి ఏ గుట్టూ బయటపడకుండానే బ్రహ్మాండంగా మద్రాసులో జరిగింది—

ఆ మర్నాడు ఖామందు కృష్ణమూర్తి దగ్గర కొచ్చి "నాయనా కృష్ణమూర్తీ! నువ్వు వారం రోజుల్లో నీ పోర్షను ఖాళీచేసెయ్యాలి" అన్నాడు.

కృష్ణమూర్తి అదిరిపోయాడు. అనుకోని పిడుగు! "అదేమిటండీ?" అన్నాడు దీనంగా.

"ఏం చెయ్యమంటావు నాయనా! మా అల్లుడు మాతో 'కలిసి వుండట్ట. నీ పోర్షనులోనే విడిగా కాపురం పెట్టుకుంటాట్ట! లేకపోతే కంటి క్కానబడకుండా పోతానంటున్నాడు" అన్నారు ఖామందు.

కృష్ణమూర్తి బిక్క మొహం పెట్టి ఆయన వంక చూడసాగాడు.

"అలా చూస్తావేం నాయనా? తప్పదు మరి. వాడు నీ పాలిట శనిగాడు-అందుకే ఇన్ని కష్టాలు నీకు! నా పాలిట ఆషాఢభూతిగాడు! నన్ను సర్వం దోచుకున్నాడు గదా! ఏం చేస్తాం? అంతే ఈ జీవితాలు" అంటూ సాగదీశాడు ఖామందు.

ఆ మర్నాడే మళ్ళీ ఇంటివేటకు బయల్దేరాడు కృష్ణమూర్తి. □

మి నీ క థ :

ఆమె కథ

"ఏమైనా పత్రికలు తెండీ" పోస్టుమాన్ భార్య శ్రీలక్ష్మి.

"ఎందుకూ పేరు గొప్ప వూరు దిబ్బ. పెద్ద ఎలక్ట్రికల్ సూపర్‌వైజరు. కరెంటు బిల్లు పాతిక రూపాయిలు-మీటరు కనెక్షన్ తప్పించండీ అంటే ధైర్యం చాలదు" ఆమె పేరు సతీసావిత్రి.

"పోలీసుజ్ఞోగం చేసి రెండు మేడలు కట్టించేడు మా నాన్న. ఎందుకు మీరూ వున్నారు" అప్పలస్వామి పెళ్ళాం వరలక్ష్మి.

"నాలుక్కార్డులు పట్రండీ ఏదో ఇంటిదగ్గరుండి పూరికే కూర్చోవడ మెందుకు చిన్న తరహా పరిశ్రమ ప్రారంభిస్తాను" సివిల్ సప్లయ్ ఆఫీసరు గుమస్తా భార్య సుగుణ.

"అందరికీ ఇంచక్కా వుద్యోగాలు. నా అమ్మడు మాత్రం రోడ్లంట" ఎంప్లాయిమెంటు గుమాస్తా భార్య పార్వతి.

"భద్రాచలం వెడదామని వుందండి. ఎవరితోనయినా చెప్పి ఫస్టుక్లాసు కంపార్టుమెంటు ఎక్కించేసారా ఆ పుణ్యమంతా మీదేనండి" టికెట్ కలెక్టర్ భార్య సత్యవతి.

"అందరి కథలూ అంటూ డబ్బిచ్చి మరీ అచ్చేసుకుంటారు. నా చెల్లెలి కథ అచ్చెయ్యమంటే వెయ్యరు. వారానికో నాలుగయినా వుత్తరాలు రాస్తోంది బావగారికి చెప్పి ఎలాగయినా తన కథ అచ్చేయించమని" కళ్ళనీళ్ళు పెట్టుకుంది నాగమణి. ఆమె ఎడిటరు భార్య మరి.

సో బ్రదర్... జీవితంలో మనిషి నిషాకి ఎక్కడ సోపానం వేస్తాడో ఏ ఒక్క జంట కథైనా తీసుకో నీకే అర్థమౌతుంది.

—జి. బి. కె రావు.